అనునిత్యం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 02 ఫిబ్రవరి 2023
1

బీఆర్ఎస్‌లో భారీ చేరికలు

నవతెలంగాణ-కడెం

మండలంలోని కొత్త మద్దిపడగా గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది బీఆర్ఎస్‌లో చేరారు. బుధవారం ఎమ్మెల్యే అజ్మీర రేఖానాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అనంతరం అదే గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జొన్న చంద్రశేఖర్ గుప్తా, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఆర్ఎస్ వ్యవస్థాపకుడు అజ్మీర శంకర్ నాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ కానూరి సతీష్, సర్పంచ్ రాజమణి ఇందూర్ పాల్గొన్నారు.



కంటి వెలుగు పథకాన్ని వినియోగించుకోవాలి

సారంగాపూర్ : కంటి వెలుగు పథకాన్ని గ్రామీణ ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని అలూరు గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. శిబిరానికి వస్తున్న ప్రజలను అక్కడ అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కంటి అద్దాలు అందజేసే విషయంలో సిబ్బంది జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని గ్రామ పంచాయతీలకు అనుబంధ గ్రామాలను గుర్తించి అక్కడ శిబిరాలు నిర్వహించిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాజేందర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, క్యాంపు వైద్యులు డాక్టర్ వేదవ్యాస్, రమేష్, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణ మోహన్‌గౌడ్ ఉన్నారు.



నిరాశపర్చిన నిర్మలమ్మ బడ్జెట్..!

- మౌళిక వసతుల కల్పనకు లభించని ప్రాధాన్యం
- సీసీఐ ఊసు లేదు..రైల్వేలైన్‌కు మోక్షం లేదు
- పేద వర్గాలకు అంతగా కనిపించని ప్రయోజనం

పార్లమెంటులో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక పద్దు ఉమ్మడి జిల్లావాసులను నిరాశకు గురి చేసింది. బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మౌళిక వసతుల కల్పనకు అవసరమైన ప్రాధాన్యం లభించలేదు. ఆదిలాబాద్ జిల్లాకు వరంలా ఉన్న సీసీఐ(సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పునరుద్ధరణపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం జిల్లావాసులను నిరాశకు గురిచేసింది. మరోపక్క అనేక ఏండ్ల నుంచి ఎదురుచూస్తున్న ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైను పనులకు ఈ ఏడాది కూడా మోక్షం లభించే పరిస్థితి కనిపించడం లేదు.ముఖ్యంగా కొత్త పరిశ్రమలు ఏర్పాటు, నూతన ఉద్యోగాల కల్పన, సాగునీటి రంగానికి కేటాయింపులు లేకపోవడంతో జిల్లాకు ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. తాజా బడ్జెట్‌లో పేదల సంక్షేమంపై కేంద్రప్రభుత్వానికి దృష్టిలేకుండా పోయిందని ప్రతిపక్షాలు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నాయి. విద్యా, వైద్యం, ఇతర మౌళిక వసతుల రంగాలను విస్మరించిందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్ రంగానికి అధిక ప్రయోజనం చేకూరేలా బడ్జెట్ ఉందని చెబుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ఎలాంటి వరాలు ప్రకటించలేదు. జిల్లాకు తలమానికంగా ఉన్న సీసీఐ పరిశ్రమను పునరద్ధరించాలని అనేక ఆందోళను జరిగాయి. సీసీఐ సాధన కమిటీ పేరిట వామపక్ష ప్రతిపక్ష పార్టీలు జేఏసీగా ఏర్పడి ఉద్యమాలు చేపట్టాయి. తాజా బడ్జెట్‌లో ఈ పరిశ్రమకు నిధులు కేటాయించే అవకాశం ఉందని ప్రజలు భావించారు. కానీ కేంద్రప్రభుత్వం పూర్తిగా పెడచెవిన పెట్టింది. మరోపక్క ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైను సర్వే 2017లోనే పూర్తయింది. కానీ ఈ లైను పనులకు నిధుల కేటాయింపు లేకపోవడంతో పనులు ప్రారంభం కావడం లేదు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లావాసులు ఈ లైను నిర్మాణంపై పెట్టుకున్న ఆశలు అడియాశలవుతున్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఓవర్ బ్రిడ్జిని కలుపుతూ మరో వంతెన నిర్మాణం, హమాలివాడ వద్ద రైల్వేగేటు మూసి వేసిన సందర్భంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించడం, సిర్పూర్(టి) వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తికాకపోవడం వంటి సమస్యలు బడ్జెట్‌లో ప్రస్తావనకు రాలేదని తెలిసింది. మరోపక్క జిల్లాకు గిరిజన యూనివర్సిటీ మంజూరుచేయకపోవడంతో ఆదివాసీ గిరిజనులను తాజా బడ్జెట్ నిరాశకు గురిచేసింది. విద్యా, వైద్యం, వ్యవసాయం, ఐటీ రంగాలకు ప్రయోజనం కలిగించేలా కేటాయింపులు చేయకపోవడం నిరుత్సాహానికి గురిచేసింది. ఇది వరకు ఏడాదికి రూ.6వేల చొప్పున అందజేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి తాజాగా ఏడాదికి రూ.8వేల చొప్పున అందజేయనున్నట్లు తెలిసింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పేరిట అందజేస్తున్న లబ్దిదారుల మాదిరి కాకుండా ఇందులో కేవలం సగం మందికే అందజేస్తోంది. నిబంధనల పేరిట అనేక మంది రైతులకు ఈ నిధిని అందజేయకపోవడంతో కర్షకుల్లోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా రాష్ట్రంలో 20కి పైగా కొత్త జిల్లాలు ఆవిర్భవించాయి. వీటిలో నవోదయ పాఠశాలలు ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా కేంద్రం దృష్టిసారించడం లేదని తెలుస్తోంది. తాజాగా బడ్జెట్‌లో కొత్త నవోదయ పాఠశాలల ప్రస్తావన లేకుండా పోయింది. ముఖ్యంగా ఆకాశన్నంటిన నిత్యావసర సరుకుల ధరల తగ్గింపుపై ఎలాంటి ప్రకటన లేకపోవడంతో నిత్యం కూలీనాలి చేసుకొని జీవించే పేదలపై ఆర్థికభారం తప్పేలా కనిపించడం లేదు.

బడ్జెట్‌తో జిల్లాకు ఒరిగిందేమీలేదు : దర్శనాల మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి



కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్‌లో జిల్లా ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ కోసం అనేక ఉద్యమాలు జరిగినా కేంద్రం స్పందించకపోవడం దారుణం. జిల్లాలో బీజేపీ ఎంపీని కూడా ప్రజలు గెలిపించారు. కానీ జిల్లా అభివృద్ధిపై కేంద్రం చిన్నచూపు చూస్తోంది. పేదల సంక్షేమంపై కేంద్రం ఏ మాత్రం దృష్టిసారించలేదు. కార్పొరేట్‌ను అనుకూలమైన బడ్జెట్‌గానే రూపొందించినట్లు కనిపిస్తోంది.

పేదవర్గాలకు ఏ మాత్రం ప్రయోజనం లేదు : ముడుపు ప్రభాకర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి



కేంద్రం ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్ పేదవర్గాలకు ఏ మాత్రం ఉపయోగకరంగా లేదు. పూర్తిగా కార్పొరేట్ అనుకూలంగానే ఉంది. పేదలకు ఉపయోగపడే పథకాలేవీ ప్రవేశపెట్టలేదు. కీలకరంగాలైన విద్యా, వైద్యంపై కూడా దృష్టిసారించలేదు. గతం కంటే కేటాయింపులు తగ్గించింది. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించేలా ఎలాంటి చర్యలు చేపట్టకుండా పేదల సంక్షేమాన్ని విస్మరించింది.

కేంద్ర బడ్జెట్ పేదలను నిరాశకు గురిచేసింది : ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యులకు మేలు కలిగించే అంశాలేమీ లేవు. పేదల సంక్షేమం, సబ్సిడీల గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా వ్యాపారులకు మేలు చేసేలా పన్నులు వసూలు చేసేలా ఉంది. తెలంగాణ రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు. విభజన హామీల మీద ఎలాంటి ప్రకటన చేయకుండా మొండిచేయి చూపించింది. ఇలాంటి బడ్జెట్‌తో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం మరింత పెరుగుతాయి.

బాధ్యతలు స్వీకరించిన ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టర్లు



నవతెలంగాణ- ఆదిలాబాద్ కలెక్టరేట్

ఆదిలాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన రాహుల్‌రాజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టగా జిల్లా అదనపు కలెక్టర్లు నటరాజ్, రిజ్వాన్ బాషాషేక్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ, వివిధ శాఖల ఉన్నతాధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నిర్మల్ : నూతన కలెక్టర్‌గా వరుణ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్ఓ లోకేష్, కలెక్టరేట్ సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఐటీడీఏ పీఓగా పని చేస్తున్న వరుణ్‌రెడ్డిని ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.



భాషా పండితులు 9,10 తరగతుల బహిష్కరణ

నవతెలంగాణ-తలమడుగు

ద్వితీయ శ్రేణి భాషా పండితులు తమకు న్యాయం జరిగేంత వరకు ఉన్నత పాఠశాలలలో తరగతులను బోధించబోమని బుధవారం నుండి నిరసన బాట పట్టారు. మండలంలోని సాయిలింగి ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న హిందీ పండిట్ ఆర్. సాంబన్న, తెలుగు పండిట్ లింబన్న ఈ మేరకు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగయ్య కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.150 ప్రత్యేక అలవెన్స్‌ను కూడా తీసుకోబోమని, తమకు గ్రేడ్ వన్ స్కేలు వచ్చేంత వరకు తరగతులు బహిష్కరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 2017 తెలుగు మహాసభల్లో ఇచ్చిన హామీ నెరవేర్చేంతవరకు సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొంటామని హిందీ భాష సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ తెలిపారు.

లంబాడా వర్గ కలెక్టర్‌ను నియమించడం ఆదివాసులను రెచ్చగొట్టడమే

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్‌కుమార్



నవతెలంగాణ-కెరమెరి

లంబాడా వర్గానికి చెందిన కలెక్టర్‌ని నియమించడం ఆదివాసులను రెచ్చగొట్టడమేనని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొదటి మహిళా కలెక్టర్‌ను నియమించి వెంటనే ఆమెను కాదని లంబాడా వర్గానికి చెందిన కలెక్టర్‌ను నియమించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన జిల్లాలో బాధ్యతలు చేపడితే జిల్లా వ్యాప్తంగా తీవ్ర నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అతనిని వేరే జిల్లాలకు బదిలీ చేయాలని, లేనిపక్షంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో జిల్లాలో మళ్లీ ఆదివాసీల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఆదివాసులకు, లంబాడాలకు మధ్య గొడవలు పెట్టేలా కేసీఆర్ కంకణం కట్టుకున్నారని విమర్శించారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కోవ విజయ్, నాయకులు ఆత్రం సాయినాథ్, భగవంత్‌రావ్ పాల్గొన్నారు.

రైతు నేస్తం విగ్రహం ఆవిష్కరణ



నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు నేస్తం విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన రైతు నేస్తం ప్రతిమలో యావత్ రైతాంగం ఆనందంగా పాడి పంటలతో ఉందని, రైతుబంధు, రైతు బీమా, 24 గంటల కరెంటు, కోటి ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా ప్రాజెక్టుల నిర్మాణం వంటి కార్యక్రమాలతో రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల లక్ష్మి శంకర్, మున్సిపల్ చైర్మన్ అంకమ్ రాజేందర్, రాము నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొర్రె గంగాధర్, సత్తెనపల్లి పిఏసిఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్, కౌన్సిలర్ కావలి సంతోష్, ప్రదీప్, వెంకన్న, పరంకుశం శ్రీనివాస్, కౌట మహేష్, జున్నారపు శంకర్ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

కడెం : నిర్మల్ డిపో నుండి ఖానాపూర్, జగిత్యాల మీదుగా వయా లింగాపూర్, మద్దిపాడుగ, బిల్లాల్, బోర్నపెల్లి, రాయికల్ బస్సుల సేవలను ఉపయోగించుకోవాలని ఆర్టీసీ మేనేజర్ అన్నారు. బుధవారం ఈ బస్సులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో కడెం ఏఆర్ఎస్ వ్యవస్థాపకులు అజ్మీర శంకర్ నాయక్, జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఆకుల లచ్చన్న, ఉపసర్పంచ్ రంజిత్ పాల్గొన్నారు.

సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ సిక్తా పట్నాయక్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిధులు వెచ్చిస్తూ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నదని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని హమీద్‌పురా, విద్యానగర్, ఖానాపూర్ పాఠశాలల్లో మన ఊరు- మన బడి, మన బస్తీ- మన బడి కార్యక్రమం కింద చేపట్టి పూర్తైన పనుల పాఠశాలలను అదనపు కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 237 పాఠశాలల్లో మరమ్మత్తులు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, ప్రహరీగోడ తదితర పనులకు శ్రీకారం చుట్టామన్నారు. హమీద్‌పురా ఉర్దూ మీడియం పాఠశాలను 20.27లక్షలు, విద్యానగర్‌లో 20.63 లక్షలు, ఖానాపూర్ (ఉర్దూ మీడియం)లో 17.39 లక్షలతో సివిల్ వర్క్ పనులు పూర్తి చేసుకొని, రంగులు, డ్యూయల్ డెస్క్‌లు, గ్రీన్‌చాక్ బోర్డులు సమకూర్చుకోవడం జరిగిందని తెలిపారు. పాఠశాలల మేనేజ్మెంట్‌లు నిర్వహణ తప్పని సరిగా చేపట్టాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం నిర్మించిన పాఠశాల భవనాలను మరమ్మత్తులు, ఇతర సౌకర్యాలు కల్పించి ఒకేసారి పనులు పూర్తి చేసుకొని పాఠశాలలను వినియోగంలోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజు పాఠశాలకు హాజరు కావాలన్నారు.

డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ విద్యా ప్రమాణాల మెరుగుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తోందని, గురుకులాలు నిర్మించిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధన ప్రవేశపెట్టి విద్యను అందించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ బదిలీ జిల్లా ప్రజలకు బాధ కలిగినప్పటికీ ప్రభుత్వ ఆదేశాలు పాటించాల్సిన బాధ్యత ఉంటుందని, ప్రజలు కలెక్టర్ సేవలను గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాలలో ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, మున్సిపల్ కమిషనర్ శైలజ, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీత, సెక్టోరల్ అధికారులు నారాయణ, నర్సయ్య, ఉదయశ్రీ, వార్డు కౌన్సిలర్లు ప్రకాష్, కలాల శ్రీనివాస్, విజయ్, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి పటిష్ట చర్యలు



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వం సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మత్స్య కుటుంబాలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం పీఓ క్యాంపు కార్యాలయంలోని గిరిజన మత్స్యకారులకు వల, ఇతర సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10వేల మత్స్య కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు 290 చెరువులకుగాను ఇప్పటివరకు 113 చెరువులలో సొసైటీలను ఏర్పాటు చేసి 3279 మంది మత్స్యకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. గిరిజన, గిరిజనేతర మత్స్యకారులకు, మత్స్య శాఖ ద్వారా వల, టూ వీలర్ వాహనాలు, తెప్ప, ఐస్ బాక్స్‌లు అందజేశామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మత్స్య కుటుంబాలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెసా కో-ఆర్డినేటర్ వసంతరావు, గిరిజన మత్స్యకారులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ఆర్థిక చేయూత



నవతెలంగాణ-బేల

పాడి రైతులకు ఆర్థికంగా చేయూత నివ్వడానికి బ్యాంక్ రుణ సదుపాయం కల్పిస్తామని ఏడిసిసి చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పాడి రైతులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేజాజీ పాల డెయిరీని సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ రైతులందరూ పత్తి, సోయా, కంది పంటలకు ప్రత్యామ్నాయంగా పాడి పరిశ్రమ వైపు దృష్టి సారించాలని, రైతులకు చేయూతనందించడానికి బ్యాంక్‌ల తరుపున రుణ సదుపాయం కల్పిస్తామని అన్నారు. గతం కంటే పాడి పరిశ్రమకు సిఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలో అత్యాధునిక సదుపాయాలతో పాల డెయిరీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ సంచాలకుడు మధుసూదన్, సర్పంచ్ ఇంద్ర శేఖర్, బేలా, డోప్టాల పీఏసీఎస్ చైర్మన్‌లు బాల్‌చందర్, జితేందర్,కేజాజి డైరీ అధ్యక్షుడు మంగేష్ ఠాక్రే, బ్యాంక్ మేనేజర్‌లు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-బేల

విక్రాంత్ కంపెనీ సోయాబీన్ విత్తనాలు వేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని యూత్ కాంగ్రెస్ నాయకులు మండలంలో ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని శివాజీ చౌక్‌లో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ సామ రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బాధిత రైతులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే జోగు రామన్న దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సామ రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో చాలామంది విక్రాంత్ కంపెనీ సోయా విత్తనాలు వేసి నష్టపోయారని గుర్తు చేశారు. కొన్ని నెలల క్రితం నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తామని కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన ఎమ్మెల్యే 6నెలల గడుస్తున్నా నష్టపరిహారం ఇప్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. నష్టపోయిన రైతులకు పరిహారం ఎందుకు ఇప్పించలేదో రైతులకు సమాధానం చెప్పాలన్నారు. వెంటనే స్పందించని పక్షంలో మండల పర్యటనకు వస్తే రైతులతో కలిసి అడ్డుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి రాందాస్ నాక్లే, మండల్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు మడావి చంద్రకాంత్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు విఠల్ దౌతడే, అవినాష్, విజయ్, విపిన్ ఠాక్రే, రాకేష్ బన్కర్, ఎండి అఖిల్, కన్య రాజు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బక్కన్న, రామలక్ష్మణ్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో అమలవుతున్న పథకాలు నత్తనడకన కొనసాగుతున్నాయన్నారు. బోర్డు నిధులు ఉన్నప్పటికీ కార్మికుల ఖాతాలో జమ చేయడంలో ప్రభుత్వం, కార్మిక శాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తున్నారని అన్నారు. పెండింగ్ దరఖాస్తుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, అదేవిధంగా పెళ్లి కానుక డబ్బులు రూ.లక్షకు పెంచాలని, ప్రసూతి కానుక డబ్బులు రూ.50వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సహజ మరణానికి ఇచ్చే డబ్బులను రూ.5లక్షలకు, ప్రమాద మరణానికి ఇచ్చే డబ్బులను రూ.10లక్షలకు పెంచాలన్నారు. నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు నేటికీ పెన్షన్ సౌకర్యం లేదని, తక్షణమే పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కట్ల లక్ష్మీ, నాయకులు మహిమూద్, గంగన్న, గఫూర్, జ్యోతి, భీమక్క, కార్మికులు పాల్గొన్నారు.

ఎస్సీ మహిళల ఆర్థిక అభ్యున్నతికి టైలరింగ్ ద్వారా ప్రోత్సాహం



నవతెలంగాణ-ఖానాపూర్

ఎస్సీ మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం టైలరింగ్ ద్వారా ప్రోత్సాహం కల్పిస్తోందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. బుధవారం ఆమె నివాసంలో మహిళలకు కుట్టుమిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 90 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న నిరుపేద ఎస్సీ మహిళలకు సన్ స్కిల్స్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎస్సీ మహిళల ఆర్థిక అభ్యున్నతికి టైలరింగ్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, ఆకుల వెంకాగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, పుప్పాల శంకర్, ప్రదీప్, ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు, మహిళలు, యువతులు, నాయకులు పాల్గొన్నారు.

రాజా దేవుషా కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్



మాజీ ఎమ్మెల్యే రాజా దేవుషా తనయుడు ఆత్రం రాజా సుధాకర్ పటేల్ గుండె పోటుతో మంగళవారం మృతి చెందిన విషయం తెలిసి ఎమ్మెల్యే రేఖానాయక్ బుధవారం కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతకు ముందు ఆత్రం రాజా సుధాకర్ మతదేహాన్ని లక్కారం నుండి పాత ఉట్నూర్‌లో గల గొండ్ రాజుల కోట వరకు కుటుంబ సభ్యులు, ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజలు అశేష జనవాణిని అంతిమయాత్రలో పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్

గురువారం 02 ఫిబ్రవరి 2023

కంటి వెలుగుకు మంచి స్పందన

నవతెలంగాణ-నార్నూర్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెండో విడత కంటి వెలుగు శిబిరానికి మంచి స్పందన లభిస్తోందని పీహెచ్‌సి హెచ్‌ఈఓ నాందేవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో బుధవారం 206 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 2వేల మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు వివరించారు. 18 ఏళ్లు పైబడినవారు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ శాంతవ్వ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

వరుణ్‌రెడ్డిని ఐటీడీఏ పీఓగా కొనసాగించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

వరుణ్‌రెడ్డిని ఉట్నూర్ ఐటీడీఏ పీఓగా కొనసాగించాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉట్నూర్ ఐటీడీఏ పీఓ కర్నాటి వరుణ్‌రెడ్డి బదిలీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేసి ఉట్నూర్ ఐటీడీఏ పీఓగానే కొనసాగించాలని అన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ పీఓ కర్నాటి వరుణ్‌రెడ్డి 12 జూన్ 2022న పదవి బాధ్యతలు చెప్పటి ఎనిమిది నెలలు గడవక ముందే బదిలీ చేయడం ఆదివాసీలను మరో సారి మోసం చేయడమే అవుతుందన్నారు. ఇప్పుడిప్పుడే ఆదివాసీలతో మమేకమై ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయలు, వారి స్థితి గతులు, సమస్యలు, ఆదివాసీల చట్టాలు, హక్కులు, జీఓలు ఒకొక్కటిగా తెలుసుకుంటూ ఆదివాసీలతో కలసి పనిచేస్తున్నా క్రమంలో తమ సమస్యలు పరిష్కరిస్తున్న సమయంలో పీఓను బదిలీ చేయడం సరి కాదన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్, జిల్లా ఉపాధ్యక్షుడు కుంర శ్యాంరావు, జిల్లా ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు గోడం రేణుక, పిప్పల్‌ధరి ఎంపీటీసీ కుంర జంగుబాపు, మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, డివిజన్ అధ్యక్షురాలు మెస్రం గంగాదేవి, నాయకులు సలాం వరుణ్, మెస్రం భాస్కర్, గెడం కేశవ్, సర్పంచులు సిడం లక్ష్మీమన్, కొడప మాధవ్‌రావు, ఉర్వేత సురేష్, దుర్వా రామచందర్, మదవి కిసన్, గెడం చందు పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా



నవతెలంగాణ-లక్ష్మణ్ చాంద

ఖానాపూర్ నుంచి నిర్మల్ వెళ్తుండగా నర్సాపూర్ డబ్ల్యు వద్ద బుధవారం ఉదయం కారు అదుపుతప్పి బోల్తా పడింది. సారంగాపూర్ మండలం చించోలి గ్రామానికి చెందిన వ్యక్తి ఫోన్ మాట్లాడుతూ కార్ డ్రైవింగ్ చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు.

మహిళను వేధించిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

మహిళను వేధించిన కేసులో ఇద్దరికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి యశ్వంత్ సింగ్ చౌహన్ బుధవారం తీర్పును వెలువరించారని లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. బేల మండలం సిర్సన్న గ్రామానికి చెందిన ఓ మహిళను 2016 సంవత్సరంలో అదే గ్రామానికి చెందిన ఆత్రం ఇస్తారి, ఆత్రం మణికంఠ మహిళలను వేధించి, దాడికి పాల్పడ్డారు. దీంతో ఇస్తారి కు ఒక సంవత్సరం జైలు శిక్ష 3,500 జరిమానా, మణికంఠకు 3 నెలల పాటు జైలు శిక్ష 500 జరిమానా విధించారు. ఈ కేసులో సీడీఓ ప్రభాకర్ సాక్షులను ప్రవేశ పెట్టగ ఏపీపీ నవీన్ కుమార్ 8 మంది సాక్షులను ప్రవేశ పెట్టగ నేరం రుజువైంది.

పాఠశాల నూతన భవనం ప్రారంభం

నవతెలంగాణ-కుభీర్

మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాస్రా గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు మంజూరైన నూతన పాఠశాల భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బుధవరాం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా ఈ పాఠశాలకు రూ.20.87 లక్షలు మంజూరైయాయని తెలిపారు. ప్రయివేటు, కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. అనంతరం మండంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఆల్కతాయి సంజయ్, టీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, స్థానిక సర్పంచులు మహిపాల్ రెడ్డి, శుష్మ అశోక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కందుర్ సంతోష్, డీఈ గంగాధర్, జేఈ మహేష్ ఎంపీటీసీ కృష్ణకల గంగరావు, ఎఈఓ చంద్రకాంత్ పాల్గొన్నారు

ఎన్నికలెప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

- ఆదిలాబాద్‌పై కేంద్రం ప్రత్యేక దృష్టి
- మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికలెప్పుడచ్చినా బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ఆ దిశగా క్షేత్ర స్థాయిలో బూత్ స్థాయి కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డిరాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన జిల్లా ఇన్‌ఛర్జి అల్జాపూర్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం తెలంగాణ రాష్ట్రంపైన అందులో అక్షర క్రమంలో మొదటిదైన ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మునుగోడులో బీఆర్ఎస్ సాంకేతికంగా గెలిచినా భారతీయ జనతా పార్టీ నైతికంగా గెలిచిందని, కేసీఆర్ పాలన న్యాయబద్దంగా జరిగి ఉంటె ఎన్నికల్లో గెలవడానికి వందల కోట్లు ఖర్చుపెట్టే అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. గ్రామానికొక ఎమ్మెల్యే ఒక మంత్రి ఎందుకొచ్చారని అన్నారు. మునుగోడు ఎన్నిక ఒక యుద్ధంలా కొనసాగిందని ఆ యుద్ధం కేసీఆర్‌కు బీజేపీ కార్యకర్తలకు మధ్య జరిగిందన్నారు. ఒకవైపు రూ.వందల కోట్ల అధికార దుర్వినియోగం, దౌర్జన్యం, అధికార పార్టీకి కొమ్ము కాసిన పోలీస్ వ్యవస్థ ఉంటె.. మరోవైపు కేవలం బీజేపీ కార్యకర్తలున్నారని తెలిపారు. ఇది బీజేపీ నైతిక గెలుపు కార్యకర్తలు ఈ ఓటమితో మరింత ధైర్యాన్ని పెంచుకోవాలన్నారు. ప్రతి కార్యకర్త తన పరిధిలో బూత్ స్థాయిలో మండల స్థాయిలో స్ట్రీట్ కార్నెర్ మీటింగులు పెట్టి ప్రజలను చైతన్య పరచాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులూ రాథోడ్ రమేష్, సుహాసినిరెడ్డి, జిల్లా నాయకులు వేణుగోపాల్, నగేష్, సుహాసిని, అంకత్ రమేష్, మానాజీ, లాలా మున్న, జోగు రవి, రత్నాకర్ రెడ్డి, విజయ్ మయూర్‌చంద్ర, రాజేష్, శ్రీనివాస్, సాకటి దశరథ్, సోమ రవి, ఆకుల ప్రవీణ్ పాల్గొన్నారు.

ఐదవ రోజుకు చేరిన నర్సుల సమ్మె

- రిమ్స్ ఎదుట వంటా వార్పు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో పనిచేస్తున్న 300 ఓసీఎస్ స్టాఫ్ నర్సుల 8 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని కంటిన్యూయేషన్ లెటర్లను ఇవ్వాలని ఉద్యోగ భద్రత ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్లతో రిమ్స్ ఎదుట తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం ఐదవ రోజుకు చేరుకుంది. ఇందులోభాగంగా ఐదవ రోజు రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా అధికారుల, రిమ్స్ డైరక్టర్ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బిక్షాటన చేసి వంట వార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో 300 ఓసీఎస్ స్టాఫ్ నర్సులు 42 మంది ప్రభుత్వ కాంట్రాక్టులో గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, కరోనా కష్టకాలంలోనూ ఫ్రంట్‌లైన్ వారియర్లుగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించారన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం వీరితో వెట్టి చాకిరీ చేయించుకోవడం తప్ప సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదన్నారు. 11వ పీఆర్సీ విషయంలోనూ సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఇతర ప్రాంతాల జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ సేవలందిస్తున్నారని, 8 నెలలుగా వేతనాలు చెల్లించకపోతే కుటుంబాలను ఎట్లా పోషించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికై రిమ్స్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్, డీఎంఈ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని పలు సందర్భాల్లో కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. జిల్లా అధికారులు డీఎంఈ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే స్పందించి 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఖాతాల్లో జమ చేయాలని, ఎటువంటి షరతులు లేకుండా 300 ఓసీఎస్ కింద పని చేస్తున్న స్టాఫ్ నర్స్ అందరినీ రెగ్యులర్ చెయ్యాలనిడిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమెళ్ల కిరణ్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బుపెల్లీ శ్రీదర్, స్టాఫ్‌నర్సులు రాజ్యలక్ష్మి, కమల, మీనాక్షి, సురేఖ, శ్రీలత, కృష్ణకుమారి, అరుణ, పెర్సి, విశాల పాల్గొన్నారు.

కరెంట్ కోతలపై రైతుల నిరసన

నవతెలంగాణ-లోకేశ్వరం



మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ముందు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కరెంట్ కోతల నుండి రైతులను కాపాడాలని కోరుతూ రాస్తారోకో నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గైని మురళీమోహన్ మాట్లాడుతూ రైతుల పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహించడాన్ని వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఏ సమయంలో కరెంటు ఇస్తున్నారో ఏ సమయంలో తీసేస్తున్నారో అనేది స్పష్టంగా తెలవకపోవడం వల్ల రైతులు పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమయాన్ని పాటించి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేసి 24 గంటలు కరెంటు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. రాస్తారోకో చేస్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి జోక్యం చేసుకొని రైతులకు సరిపోయే కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోలో జిల్లా సహాయ కార్యదర్శి తిమ్మాపురం ముత్తన్న, పుస్పూర్ గ్రామ అధ్యక్షులు ప్రసాద్, కార్యదర్శి తిమ్మాపురం దేవేందర్, డివిజన్ నాయకులు ఓరగంటి సాయన్న, నగరం మహిరాజ్, శాల గంగాధర్ పాల్గొన్నారు.

వేతన జీవులను వంచించిన కేంద్ర ప్రభుత్వం

నవతెలంగాణ-నిర్మల్



బడ్జెట్‌లో వేతన జీవులను కేంద్ర ప్రభుత్వం వంచించిందని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ అన్నారు. వివిధ సంఘాల నుండి టీఎస్‌యూటీఎఫ్‌లో చేరిన ఉపాధ్యాయులకు సభ్యత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి మధ్య తరగతి వేతన జీవులకు భారీ ఊరట పేరుతో ప్రచారం చేసుకోవటం సమంజసం కాదని విమర్శించారు. పాత, కొత్త పన్ను విధానాలను కొనసాగిస్తున్న క్రమంగా పాత పన్ను విధానాన్ని ఎత్తివేయటానికే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైందని తెలిపారు. పరోక్ష పన్నుల ద్వారా వేతనాల నుంచి ఆదాయాన్ని



రాబట్టుకుంటున్న ప్రభుత్వం వేతనాలపై భారీగా పన్ను వేయటమే అర్థరహితమని తెలిపారు. కార్పోరేట్లు, ధనికులకు అధిక పన్ను రాయితీ ఇచ్చిన ప్రభుత్వం చిన్న, మధ్యతరగతి ఉద్యోగులకు ఏమాత్రం ప్రయోజనం కలిగించలేదని, కొత్త పన్ను విధానంలో పన్ను రాయితీ రూ.5 నుంచి రూ.7లక్షలకు పెంచారు, కానీ కొత్త విధానంలో ఎలాంటి మినహాయింపులు ఉండవన్నారు. అధికాదాయ వర్గాలకు మాత్రమే ఇది కొంత మేరకు ఉయోగకరమని, తక్కువ వేతనాదాయ వర్గాలు వినియోగించుకుంటున్న పాత పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ 2.50 లక్షల నుండి రూ 3 లక్షలకు పెంచటం నామ మాత్రమేనని తెలిపారు. పొదుపు మొత్తాలపై రాయితీని రూ.1.50 లక్షలను అలాగే కొనసాగించారని, 2014కు ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీజేపీ డిమాండ్ చేసిన స్టాండర్డ్ డిడక్షన్ రూ.5 లక్షలను పొదుపు మొత్తాలపై రూ.3 లక్షలకు పెంచాలన్న డిమాండ్ కానీ, అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్ళ తర్వాత కూడా అమలు చేయలేదని తెలిపారు. స్లాబు రేట్లు సవరణ కూడా స్వల్పంగానే ఉందని, ఈ బడ్జెట్ ద్వారా ధరలు ఏమాత్రం తగ్గే అవకాశం లేదని, గృహ నిర్మాణానికి ప్రోత్సాహం లేదని మొత్తంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన బడ్జెట్ సగటు వేతన జీవులకు ఏమాత్రం సంతృప్తిని కలిగించలేదని విమర్శించారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

- పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి
- ఎంపీపీ గంద్రత్ రమేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



ఎంపీపీ గంద్రత్ రమేష్ అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. అధికారులు వారి శాఖలలో మూడు నెలలో సాధించిన ప్రగతి నివేదికలను సభ్యులకు చదివి వివరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని మండల వైద్యాధికారి డాక్టర్ రాహుల్ గడపలే పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు సైతం కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ గంద్రత్ రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి లబ్దిదారులు వాటిని సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పని చేస్తూ మండల అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న సహకారంతో మండలన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో ఇప్పటికే రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాలకు బిటీ రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో నల్ల నీరు అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మండలంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని చెప్పారు. ఈ సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు షేక్ ఆరీఫ్, ఎంపీడీవో శంకర్, ఆనంద్ కుమార్. సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విరమణ పొందిన పోలీసు అధికారులకు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేసి పదవీ విరమణ పొందిన 25 మంది పోలీసు అధికారులను జిల్లా కేంద్రంలో బుదవారం ఎస్పీ సన్మానించారు. అంతకుముందు పోలీస్ పరేడ్ మైదానంలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పించారు. పదవీ విరమణ పొంది సన్మానం అందుకున్న అధికారులు, ఎస్పీ బి.శశిధర్ రాజు, సిహెచ్ రామచందర్, అదనపు ఎస్పీలు కే సుకుమార్ రెడ్డి, ఏ.రాంరెడ్డి, సీతారాములు, శేష్ కుమార్, ఆర్ మధు మోహన్ రెడ్డి, వి.సాయిలు, టి.ప‌ద్మనాభరెడ్డి, డీఎస్పీలు డి.మొగిలి, ఎస్.బాలరాజు, కే.శివప్రసాద్, బి డేవిడ్, ఏ.ఉదయ్ కిరణ్, ఈ విజయకుమార్, మల్లయ్య, ఏసీపీ జి.రాధాకృష్ణ, సీఐలు డిఏ.జాన్ దివాకర్, సిహెచ్ భీమన్న, సి లచ్చన్న, బి.ఏలియా, ఎం ఏ కరీం, కే.పురుషోత్తం, ఏవో గంగాధర్‌లు ఉన్నారు. వీరందర్ ఆదిలాబాద్ జిల్లాలో సుదీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ పొందిన అధికారులు ఈ కార్యక్రమంలో వారు ఉద్యోగంలో ఉన్నప్పుడు చోటుచేసుకున్న సంఘటనలను, విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజారక్షణకై తీసుకున్న నిర్ణయాలు, సంఘ విద్రోహశక్తులతో పోరాడిన సంఘటనలను తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్ శ్రీనివాసరావు, బి.రాములు నాయక్, సి.సమయ్ జాన్ రావు, ఆదిలాబాద్ డీఎస్పీ వి.ఉమేందర్, సీఐలు కే.పురుషోత్తం, కే సత్యనారాయణ, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్‌లు డి.వెంకటి, ఎం శ్రీపాల్, ఎస్సైలు అన్వర్ ఉల్ హక్, జి.అప్పారావు పాల్గొన్నారు.

అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

అందరి సహకారంతో జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం బదిలీపై వచ్చిన ఆయన ఆయన కలెక్టర్ ఛాంబర్‌లో బాధ్యతలు తీసుకున్న సందర్భంలో ఆయన మాట్లాడారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, కలెక్టరేట్ సిబ్బంది పూల మొక్కలు, పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2021 సంవత్సరంలో రెండు నెలల పాటు ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిచడం జరిగిందని, అదే సమయంలో కరోనా వ్యాప్తి విధులు నిర్వహించవలసి వచ్చిందని తెలిపారు. జిల్లాలో మాత శిశు మరణాలను తగ్గించే విధంగా ఆసిఫాబాద్ జిల్లాలో ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ప్రస్తుతం మరణాలు తగ్గాయని అదేవిదంగా ఆదిలాబాదు జిల్లాలో కూడా సమిష్టి కృషితో జీరో స్థాయికి తీసుకురావాలని అన్నారు. గిరిజన జిల్లాలో పనిచేయడం సంతృప్తి కరంగా ఉంటుందని, మరో గిరిజన ఆదిలాబాదు జిల్లాలో పనిచేయడానికి అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి శాఖల సమన్వయం అవసరమని ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని అన్నారు. త్వరలో శాఖల వారిగా సమీక్షలు నిర్వహిస్తానని, దేశంలో జీడీపీ ఉన్నట్లుగానే జిల్లా స్థాయిలో కూడా ప్రగతి అంశాలపై సమీక్షలు ఉంటాయని తెలిపారు. గత సంవత్సరం సాధించిన ప్రగతి కంటే ఈ సంవత్సరం 15 నుండి 20 శాతం ఎక్కువ ప్రగతి సాధించే విధంగా యంత్రాంగం పని చేయాలని అన్నారు. గత రెండు సంవత్సరాల ప్రగతి నివేదికల ఆధారంగా ఈ సంవత్సరం ఆక్షన్ ప్లాన్ నిర్దేశించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఎన్.నటరాజ్, రిజ్వాన్ బాషా షేక్, జిల్లా అటవీ అధికారి రాజశేఖర్, ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓలు రమేష్ రాథోడ్, కదం సురేష్, కలెక్టరేట్ ఏఓ అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పోస్టల్ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ షఫీయుద్దీన్ అన్నారు. బుధవారం మండలంలోని మోర్కాండి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామస్తులకు పోస్టల్ శాఖ అందిస్తున్న సేవల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో పొదుపు ఖాతాలను, గ్రామీణ తపాలా జీవిత బీమా, సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్లు వంటి అనేక పథకాలను తపాల శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అప్పుడే పుట్టిన ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజనలో అకౌంటు ఓపెన్ చేసి ప్రతి నెల వారి స్థాయికి తగ్గట్టుగా పొదుపు చేసుకున్నట్లయితే భవిష్యత్తులో చదువు, పెళ్లి సమయంలో పొదుపు సొమ్ము ఉపయోగపడుతుందని అన్నారు. అతి తక్కువ రూపాయలతో వార్షిక జీవిత బీమాను వారి వయసుకనుగుణంగా పోస్ట్ ఆఫీస్‌లలో తీసుకోవచ్చన్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తొడసం అనిత, మేల్ ఓవర్సీస్ మునీర్, బిపిఎంలు రాధ, అశ్విని, శ్రీకాంత్, సిబ్బంది నరేష్, రణధీర్, భోజన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి

నవతెలంగాణ-ఇచ్చోడ

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఎన్ఎం కరుణ అన్నారు. బుధవారం మండలంలోని బోరిగామ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో కుష్టు వ్యాధి నివారణ, వాటి లక్షణాలపై గర్భిణులు, పిల్లల తల్లులకు ఏఎన్ఎం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టువ్యాధి మైక్రోబాక్టీరియా లెప్రే ద్వారా వస్తుందని, ఇది అంటువ్యాధి కాదని తెలిపారు. కుష్టువ్యాధికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోందని తెలిపారు. గ్రామస్తులతో కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ చంద్రకళ, ఆశా కార్యకర్త గంగమ్మ పాల్గొన్నారు.

వసతిగృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ వసతిగృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా ఎన్నికలను పట్టణంలోని టీఎన్జీవోస్ సంఘ భవనంలో బుధవారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా టీఎన్జీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ వ్యవహరించారు. వసతిగృహం సంక్షేమ అధికారి సంఘం జిల్లా అధ్యక్షునిగా జె.నర్సిములు, ప్రధాన కార్యదర్శిగా అమిత్ చౌహన్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్, కోశాధికారిగా రాథోడ్ అనిల్, సహా అధ్యక్షులుగా బి రవీందర్, గంగాదేవి, రాధ, సంయుక్త కార్యదర్శులుగా జయ, రోహిణి, దేవమ్మ, కార్యనిర్వాహక కార్యదర్శి పర్వేజ్, ప్రచార కార్యదర్శిగా శ్యాంసుందర్, కార్యవర్గ సభ్యులుగా రవీందర్, ప్రతిమ, నగేష్, శ్రావణిని ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులను టిఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ సన్మానించారు. ధ్రువీకరణ పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు.

విద్యార్థులకు షీ టీం సేవలపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



విద్యార్థి దశ నుండే విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని షీ టీం ఇన్‌ఛార్జి ఏఎస్సై సునీత అన్నారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కస్తూరి గాంధీ బాలికల విద్యాలయం తో పాటు బాలికల జూనియర్ కళాశాలలో షీ టీం సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేసిన వెంటనే భయపడకుండా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సైబర్ నేరాలు, 1930 నంబర్ బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, క్యూఆర్ కోడ్, ఫోక్స్ యాక్ట్, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టూ టౌన్ ఎస్సై, ఐటి కో రియాజ్, హెడ్ కానిస్టేబుల్ అశోక్ రావు, స్కూల్ ప్రిన్సిపాల్ విద్యార్థులు పాల్గొన్నారు.

దళితులందరికీ 'దళితబంధు' ఇస్తాం : రేఖానాయక్

నవతెలంగాణ-జన్నారం

దళితులందరికీ దళిత బంధు ఇస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని పోన్కల్ గ్రామపంచాయతీలోని ఎస్సీ కాలనీలో దళితులతో దళిత బంధు పథకంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్మమన్నారు. దళితులంతా బీఆర్ఎసకు బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన వైస్ ఎంపీపీ సూపర్ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీపతి పద్మ, వైస్ చైర్మన్ గోట్ల రాజేష్ యాదవ్, కోఆప్షన్ సభ్యుడు మున్వరలీ ఖాన్, స్థానిక సర్పంచ్ జక్కు భూమేష్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సూర్య జనార్ధన్, యువజన అధ్యక్షుడు పేరం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికుల వస్తువులకు, కంపెనీ ఆస్తులకు రక్షణ కరువు

నస్పూర్ : కార్మికుల వస్తువులకు, కంపెనీ ఆస్తులకు రక్షణ కరువైందని సీఐటీయూ నాయకులు శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు గుల్ల బాలాజీ, డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కస్తూరి చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణిలో కేవలం వ్యక్తిగత భద్రత అంటూ హెల్మెట్, రేడియం జాకెట్లపై మాత్రమే దృష్టి పెడుతుందని మండిపడ్డారు. గతంలో ఆర్కే-5 గనిపై సెల్ఫోన్ దొంగతనం, తాజాగా ఎస్ఆర్పీ-1 గనిపై బిట్లు దొంగతనం, ఎస్ఆర్పీ-3లో కార్మికుని సెల్ఫోను దొంగతనం జరిగిందని, కార్మికులతో పాటు కంపెనీ ఆస్తులకు కూడా రక్షణ కరువైందని ఆరోపించారు. యాజమాన్యం కూడా చూసి చూడనట్లు వ్యవరిస్తుందని విమర్శించారు. సింగరేణిలో ఎస్ అండ్ పీసీ కొరత ఉన్నా కూడా నియామకాలు చేపట్టడం లేదని, సీనియర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా కూడా పట్టించుకోవడంలేదని అన్నారు. యాజమాన్యం కార్మికుల వస్తువులు కంపెనీ ఆస్తులపైన తగిన దృష్టి పెట్టి దొంగతనాలు జరగకుండా కార్మికుల వస్తువులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్సీ హాస్టల్ ఎదుట నిరసన

నవతెలంగాణ-మంచిర్యాల

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. బుధవారం బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ హాస్టల్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.3200 కోట్లు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలనీ, జిల్లా వ్యాప్తంగా స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.16 వేల కోట్ల పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, ఫిబ్రవరి 5 నుంచి జరగబోయే రాష్ట్ర బడ్జెట్ సమావేశంలో విద్యారంగానికి 30 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కాస్మెటిక్ ఛార్జీలు పెంచాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టల్ విద్యార్థులకు నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్రవ్యాప్తంగా విద్యరంగ సమస్యలు పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో పవన్, కళ్యాణ్, వేంకటేశ్, మల్లేష్, సాగర్, సురేష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

నవతెలంగాణ-తాండూర్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తాండూర్ ఐబి చౌరస్తాలో ధర్నా నిర్వహించి ఎంఈఓ వాసాల ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు దాగాం రాజారాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. కార్మికులకు ఇచ్చే వేతనం కేవలం రూ.వేయ్యి మాత్రమేనని తమ జీవనోపాధి కష్టంగా మారిందని ఆవేధన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కోడిగుడ్డు ధర కు అనుగుణంగా ధర చెల్లించడం లేదన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం పెంచిన రూ.2000 ఈ అసెంబ్లీ సమావేశాల్లో నైనా జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాగి జావా కాచిపోయాడానికి అయ్యే ఖర్చు నిమిత్తం అదనంగా పారితోషికం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల కోడిగుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వేల్పుల శంకర్, బొల్లం రాజేశం, దుర్గం నాన్నయ్యా, రాద, జేనేని లక్ష్మి దార వేణి లక్ష్మి శంకరమ్మ, రామ్ టెంకి లక్ష్మి, అనిషా, తిరుమ పాల్గొన్నారు

ఆపరేషన్ స్మైల్‌తో 43 మంది బాలబాలికలకు రక్షణ

- అదనపు ఎస్పీ(అడ్మిన్) అచ్చేశ్వరరావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆపరేషన్ స్మైల్ 2023 ద్వారా జిల్లా వ్యాప్తంగా 43 బాలబాలికలకు రక్షణ కల్పించామని ఆసిఫాబాద్ అదనపు ఎస్పీ అడ్మిన్ అచ్చేశ్వర రావు అన్నారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఆపరేషన్ స్మైల్ పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బాలలకు హక్కులను కల్పించడానికి ఆపరేషన్ స్మైల్-09 బృందం జనవరి 1 నుంచి 31 వరకు చేసిన రెస్క్యు ఆపరేషన్ కృషి ఫలించిందని అన్నారు. జిల్లాలో రెండు డివిజన్ లలో కలిపి మొత్తం 43 మంది బాలబాలికలను గుర్తించినట్టు తెలిపారు. ఆసిఫాబాద్ డివిజన్‌లో 21 మంది, కాగజ్ నగర్ డివిజన్ లో 22 మంది బాలబాలకలు, ఇందులో మొత్తంగా 42 మంది బాలురు కాగ, ఒక బాలిక ఉన్నారని అన్నారు. ఈ ఆపరేషన్ లో పోలీస్ శాఖ, విద్యాశాఖ, రెవెన్యూ శాఖ, కార్మిక శాఖ, బాలల రక్షణ విభాగం అధికారులు భాగమయ్యారని తెలిపారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 18 ఏళ్లలోపు ఉన్న బాలలను పనిలో పెట్టుకున్న యజమానులకు జరిమానా విధించామన్నారు. ఆయా ప్రాంతాల్లోని చిన్నారుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి మళ్లీ పిల్లల్ని పనిలో పెట్టుకుంటే తీసుకునే చర్యలపై అవగాహన కల్పించామన్నారు. బాలకార్మికులను గుర్తించినవారు డయల్ 100 లేదా 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమానికి ఆసిఫాబాద్ డివిజన్‌లో ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన ఎస్సై రామన్ కుమార్, కాగజ్‌నగర్ డివిజన్ లో ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించిన ఎస్సై అబ్దుల్ సత్తార్‌లను, ఆపరేషన్ స్మైల్ 09 బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్, టాస్క్ ఫోర్స్ సీఐ సుధాకర్, జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారిని సావిత్రి, కోఆర్డినేటర్ సత్యనారాయణ, లీగల్ సర్వీస్ మెంబర్ సూర్యకళ, షీ టీం ఇన్‌చార్జి ఎస్సై రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

నవతెలంగాణ-వేమనపల్లి

నీల్వాయి ప్రాజెక్టు కట్ట కింద ఇబ్బందులతో సతమతమవుతున్న తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని మామడ గ్రామస్తులు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను బుధవారం క్యాంప్ కార్యాలంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వర్షాకాలం వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తమకు ఇంటి స్థలాలు కేటాయించి డబుల్ బడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గొర్క లింగరాజు, గొర్క రాజన్న, నర్వెల్లి మంకయ్య, నర్వెల్లి వెంకన్న, నరవెల్లి ఐలయ్య, గజ్జి మహేష్, గజ్జి శంకర్, గజ్జి మల్లయ్య, పందుల పోచమల్లు, కాయిత రాజన్న, జల్ల ఎర్రయ్య పాల్గొన్నారు.

18 నెలలకే నిండుకున్న నూరేళ్లు

- ఆటో కింద పడి బాలుడి మృతి
- పోలీసుల కేసు నమోదు

నవతెలంగాణ-దహెగాం

18 నెలలకే నిండు నూరేళ్లు నిండిపోయాయి. అబంశుభం తెలియని చిన్నారి ఆటో క్రింద పండి మృతిచెందిన సంఘటన మండలంలోని బీబ్రా గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బీబ్రా గ్రామానికి చెందిన దుర్గం సాయికుమార్-లలిత దంపతుల కుమారుడు దుర్గం చోటు(18) నెలల బాబు ప్రమాదవశాత్తు ఆటో క్రింద పడి మృతిచెందాడు. కాగజ్‌నగర్ మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన షేక్ సాజిద్ అనే వ్యక్తి తన ట్రాలీఆటోలో కరబూజకాయలు అమ్మడానికి బీబ్రా గ్రామానికి రాగా దుర్గం శాంతాబాయి కరుబూజకాయలు కొనుగోలు చేసి డబ్బులు తీసుకురావడానికి ఇంటికెళ్లి తన మనుమడు దుర్గం చోటును ఎత్తుకొని డబ్బులు తీసుకొచ్చి సాజిద్‌కు ఇచ్చే క్రమంలో మనుమడిని కింద దించింది. సాజిద్ డబ్బులు తీసుకోవడానికి ఆటోను ప్రక్కకు ఆపే క్రమంలో ముందుకు నడిపాడు. అప్పటికే ఆటో క్రిందికి చోటు దూరి ఉండడం గమనించకపోవడంతో చోటు పైనుండి ఆటో వెళ్లి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్టు పేర్కొన్నారు. బాలుడి నానమ్మ దుర్గం శాంతాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

నస్పూర్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని 10వ వార్డు కౌన్సిలర్ సీపతి సుమతి-మల్లేష్ అన్నారు. బుధవారం 10వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వార్డులో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ స్నేహిత, ఏఎన్ఎం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయికి యువత బానిస

- దాడులు నిర్వహించినా ఆగని దందా
- మండలంలో అడ్డాలను గుర్తించిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది


గంజాయితో పట్టుబడ్డ యువకులు (ఫైల్)

నవతెలంగాణ-జన్నారం

పట్టణాల నుంచి గంజాయి ఘాటు పల్లెలకు పాకి యువత దానికి బానిసవుతున్నారు. గ్రామాల్లోని యువత మత్తు బారిన పడుతున్నారు. మండలంలోని కవ్వాల్, కామన్పల్లి, పొనకల్, జన్నారం, బాదంపల్లి, మొర్రిగూడ, కలమడుగు తదితర గ్రామాల్లో పలువురు యువకులు గంజాయి వాడు తున్నట్లు తెలిసింది. కవ్వాల్ గ్రామంలో చెరువుక ట్టపై ఈత, చింత చెట్లలో కొందరు యువకులు గంజాయి పీల్చడానికి వాడే బాటిళ్లను దాయడం తోపాటు గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పొనకల్ పట్టణంలోని ఉర చెరువు కట్ట, సాయంత్రం అయితే చాలు పలు ప్రాంతాల యువకులకు గంజాయి అడ్డాగా మారుతోంది. పలు ప్రాంతాల్లో బ్యాచ్లుగా తిరుగుతూ గంజాయి తాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పోలీసుల దాడులు నిర్వహించినా ఆగతి తంతు



జన్నారం మండలంలో గతంలో ఎస్సైగా పనిచేసిన మధుసూదన్ రావు గాంజాయి స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. దీంతో కొన్ని రోజుల పాటు గంజాయి వినియోగం తగ్గుముఖం పట్టింది. ఆ తర్వాత అడ్డాలు మార్చిన యువకులు తిరిగి, వాడుతున్నట్లు తెలుస్తోంది. పల్లెల్లో ఇంటర్, పదో తరగతి విద్యార్థులు గంజాయికి బానిసలుగా మారు తున్నారు. ఇటీవల జరిగిన రెండు రోడ్డు ప్రమా దాలు కూడా గంజాయి మత్తులోనే జరిగినట్లు తెలుస్తోంది. జన్నారం మండలానికి చెందిన ఓ యువ కుడు గంజాయికి బానిసగా మారి ఆస్పత్రిపాలయిన ఘటన ఇటీవల వెలుగు చూసింది.

టాస్క్ ఫోర్స్ దాడులతో బలం.

మండలంలోని పలు గ్రామాల్లో టాస్కోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గంజాయి తాగే బాటిళ్లు, గంజాయి దొరికినట్లు అధికారులు పేర్కొంటున్నారు. టాస్క్ ఫోర్స్ దాడులతో మండలంలో గంజాయి వాడకం పెరిగిందనే వాదనకు బలం చేకూరుతోంది. 5 నెలల క్రితం జన్నారం మండలం లోతొర్రే గ్రామంలో ఓ రైతు చేనులో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ధ్వంసం చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

మండల పరిషత్ సమావేశంలో చర్చ

వారం రోజుల క్రితం గంజాయి అమ్ముతూ, తాగుతున్న ముగ్గురుని జన్నారం ఎసై పి.సతీష్ పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయి రూ.3000 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. జనవరి 20 తేదీన మండల సర్వసభ్య సమావేశంలో కూడా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు ఎంపీటీసీలు, గంజాయిపై ఎక్సైజ్ ఎస్సై రాబర్ట్‌ను జన్నారం ఎసై పి.సతీష్‌ను నిలదీశారు. గ్రామాల్లో గంజాయి వాడకం ఎక్కువై యువత గంజాయికి బానిసవుతున్నారని పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.


మండల సర్వసభ్య సమావేశంలో చర్చ (ఫైల్)

పట్టుబడితే కఠిన చర్యలు

-ఖలీముల్లఖాన్, సీఐ



మండలంలోని పలు గ్రామాల్లో గంజాయి వాడుతున్నట్లు తెలిసింది. గంజాయికి అలవాటు పడి యువకులు జీవితం నాశనం చేసుకోవద్దు. గంజాయి స్థావరాలపై దాడులు నిర్వహిస్తాం. పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

కలెక్టర్ బదిలీపై జిల్లా కేంద్రంలో సంబరాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ కావడంపై జిల్లా కేంద్రంలో విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన రాహుల్ రాజ్ జిల్లాలోని అవినీతి అధికారులు, జిల్లాలో జరిగిన అక్రమాలపై మెతక వైఖరి వహించడంతో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్‌ని వెంటనే బదిలీ చేయాలని పలురూపాలలో ఉద్యమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. కలెక్టర్ల బదిలీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కుమురంభీం జిల్లా కలెక్టర్‌ను బదిలీ చేయడం హర్షించదగ్గ విషయమని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అదేవిధంగా కొత్తగా వస్తున్న కలెక్టర్ ద్వారా జిల్లాలోని అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేకూరుతుందని ఆశ పడుతున్న సందర్భంలో రెగ్యూలర్ కలెక్టర్ కాకుండా ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా నియమించడం చాలా బాధాకరమని అన్నారు. మంగళవారం పోస్టింగ్ ఇచ్చిన కొత్త కలెక్టర్ 24 గంటల లోపే, వేరే జిల్లాకు కేటాయించారని, జిల్లాకు ఇన్‌ఛార్జి పాలనవద్దని, రెగ్యులర్ కలెక్టర్ నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మారుతి, టీఎమ్మార్పీఎస్ అంబాల రవి, మసాడే చరణ్ మండల అధ్యక్షులు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్, టీఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోల్కర్ సాయిరాం, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జగజంపుల తిరుపతి, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు అవిడపు ప్రణయ్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కిర్డీ గ్రామానికి చెందిన వడ్లూరి చంద్రమ్మ(58) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతురా భర్త చంద్రయ్య, కుమారుడు మల్లేష్‌లు మద్యానికి బానిసై కూలీ డబ్బులతో తాగుడుకు బానిసయ్యారు. ఎన్ని సార్లు వారించిన వారు మారక పోవటంతో ఆర్థిక ఇబ్బందులు తాలలేక ఆమె అన్నయ నాగయ్యకు చెప్పింది. ఎవరు చెప్పిన వారిలో మార్పు రాకపోవటంతో మంగళవారం చెనులో ఉన్న పుగరుగుల మందు తాగి రాత్రి ఇంటికి వచ్చింది. ఆమెను ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందిందని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి అన్నయ్య నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి చేసినట్టు ఎస్సై తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్
- మన ఊరు-మనబడి పాఠశాల ప్రారంభోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమం దోహదపడుతుందని ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మన ఊరు-మన బడిలో భాగంగా మొదటి విడతలో ఎంపికైన మండలంలోని అంకుసాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తేలేగూడ గ్రామంలో రూ.32 లక్షల వ్యయంతో పనులు చేపట్టిన మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్ పాయి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మన ఊరు మనబడి కార్యక్రమం మొదటి విడతలో భాగంగా జిల్లాలో 251 పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందని, అన్ని పనులు పూర్తి చేసుకొని ఈరోజు తేలేగూడ గ్రామ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. పాఠశాలలో బెంచీలు, వంటశాల, భోజనశాల, ప్రహరీ గోడ, అదనపు గదులు, త్రాగునీరు, విద్యుత్ సరఫరా ఇతర అన్ని వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యా రంగ అభివృద్ధిలో సమూల మార్పు తీసుకురావటం జరిందని తెలిపారు. విద్యార్థులకు వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించడం చాలా సంతోషంగా ఉందని, తేలేగూడ పాఠశాలలో 200 మంది విద్యార్థులు ఉన్నారని, ఇందులో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ రామ్మోహన్ రావ్, జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


తాండూర్‌లో ఎమ్మెల్యే చిన్నయ్య

మనఊరు-మనబడితో ఆధునిక సౌకర్యాలు

తాండూర్ : తెలంగాణ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు మనఊరు-మనబడి కార్యక్రమం ద్వారా ఆధునిక సౌకర్యాలను కల్పిస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం కొత్తగా నిర్మించిన గోపాల్‌నగర్ పాఠశాలను ప్రారంభించారు. మనఊరు-మనబడి ద్వారా నిర్మించిన ప్రహరీ గోడ, మరుగుదొడ్లు వంటగదులను ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, మార్కెట్ డైరెక్టర్లు గట్టు సంతోష్‌కుమార్, కొలిపాక రంజిత్‌కుమార్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మనఊరు-మనబడి ద్వారా ప్రతి మండలానికి నిధులు కేటాయించి ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాల కల్పిస్తోందని తెలిపారు. ఈ పథకంలో భాగంగా మండలానికి రూ.ఐదు కోట్ల నిధులు మంజూరు కాగా గోపాల్‌నగర్ పాఠశాలకు రూ. 26.66 లక్షల నిధులు కేటాయించినట్టు వివరించారు. పథకంలో భాగంగా మండలానికి 14 పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరయ్యాయన్నారు. జిల్లాలోనే మనఊరు-మనబడి పనులను త్వరగా పూర్తి చేసిన సర్పంచ్ గజ్జల ఒక్కమ్మ, ఎంఈఓ. వాసాల ప్రభాకర్, ఏఈ అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి వసంత, ఉపాధ్యాయులు సుధాకర్, సతీష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీపీ పూసల ప్రణయ్‌కుమార్ గోపాల్‌నగర్‌లోని బీసీ ప్రజలకు ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బానయ్య, జిల్లా సెక్టోరల్ అధికారి అలీఖాన్, మండల కో ఆప్షన్ సభ్యులు రహమత్ అహ్మద్, రైతు సమన్వయ సమితి అధ్యక్షడు దత్తాత్రేయ, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.


ఆసిఫాబాద్‌లో కలెక్టర్

జన్నారం : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని పోన్కల్ గ్రామపంచాయతీ పరిధిలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో నిర్మించిన నూతన భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పేద విద్యార్థు కోసం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ప్రైవేటు పాఠశాలలలో అధిక ఫీజులు తీసుకోవడంతో చాలామంది పేదలు చదువుకు దూరమవుతున్న తరుణంలో చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టలను ఏర్పాటు చేసి విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు సన్నబియ్యంతో నాణ్యమైన భోజనంతో పాటు విద్యనందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి చిటిమల్ల భరత్ కుమార్, ఎంపీపీ మాదాడి సరోజన, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీపతి పద్మ, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుర్రం రాజారాంరెడ్డి సులువ జనార్ధన్, స్థానిక సర్పంచ్ జక్కు భూమేష్, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, ఎంఈఓ విజయ్ కుమార్,

ఎంపీడీఓ అరుణ రాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్, ఎన్‌సీసీ అధికారి కట్ట రాజమౌళి, జనార్ధన్, వీవీఎస్ నాయక్ పాల్గొన్నారు.


జన్నారంలో ఎమ్మెల్యే రేఖానాయక్

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తి జైలుకు తరలింపు

నవతెలంగాణ-దండేపల్లి

బైండోవర్ ఉల్లంఘన కేసులో మండలంలోని తానిమడుగు గ్రామానికి చెందిన మాలవత్ రమేష్‌ను జైలుకు తరలించినట్లు లక్షెట్టిపేట ఎక్సైజ్ సీఐ ఎస్ బాబా తెలిపారు. నాటుసారా కాస్తూ పట్టుబడగా పలుమార్లు బైండోవర్ చేసినా నేర ప్రవృత్తిని మార్చుకోకపోవడంతో దండేపల్లి తహసీల్దార్ హనుమంతరావు రమేష్‌కు జైలు శిక్ష విధించారని తెలిపారు. ఆయనను ఆదిలాబాద్ జైలుకు పంపినట్లు తెలిపారు. నాటుసారా కాస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో పట్టుబడిన వారికి ఉపాధి నిమిత్తం ప్రభుత్వం రుణాలు మంజూరు చేసిందని, రుణాలు పొంది కూడా మళ్లీ నాటుసారా కాస్తున్నారని అన్నారు. రెండుసార్లు బైండోవర్ చేసినా తీరు మార్చుకోలేదని, అందుకే జైలు శిక్ష విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

మండల స్థాయి పోటీలు విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఫిబ్రవరి 6 నుండి మూడు రోజులపాటు నిర్వహించే ఎంపీపీ కప్ ఆసిఫాబాద్ మండల స్థాయి క్రీడా పోటీలు విజయవంతం చేయాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో అన్ని పాఠశాలల పీఈటి, పీడీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 6, 7, 8న మండల స్థాయి క్రీడా పోటీలు ఎంపీపీ సీజనల్ కప్ పేరుతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొనే విధంగా చూడాలని సూచించారు. రెండు సంవత్సరాల నుండి కరోనాతో క్రీడాకారులు క్రీడలకు దూరమయ్యారని, వారిలో మళ్లీ శారీరక మానసిక ఆహ్లాదాన్ని నింపేందుకు ఇవి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, ఎంఈఓ మనుకుమార్ పాల్గొన్నారు.

మన ఊరు మన బడితో పాఠశాలకు మహర్దశ

నవతెలంగాణ-ఖానాపూర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన బడితో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వస్తుందని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. మండలంలోని బాదనకుర్తి గ్రామంలో బుధవారం మన ఊరు మన బడి పథకంలో భాగంగా ప్రాథమిక పాఠశాల పున:ప్రారంభానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ఊరు మన బడి పథకంలో భాగంగా తెలంగాణలో ప్రతి పేద విద్యార్థికి పాఠశాలలో చక్కటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకే మన ఊరు మన బడి పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం అదే గ్రామంలో రజక సంఘ భవనానికి రూ.2లక్షల ప్రొసీడింగ్ అందజేసి భూమి పూజ చేశారు. అనంతరం కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేసి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ పార్శపు శ్రీనివాస్, ఎంపీటీసీ శనిగారపు రాణి శ్రావణ్, ఆకుల వెంకాగౌడ్, పుప్పాల శంకర్, ఎంపీడీవో మల్లేశం పాల్గొన్నారు.

దళితబంధు మార్గదర్శకాలు విడుదల చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెండో విడత దళిత బంధు మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని టిఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్, అధికార ప్రతినిధి నక్క రాందాస్ అన్నారు. బుధవారం అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మొదటి విడత దళితబంధు పథకంలో వంద మంది లబ్దిదారులకు లబ్ది చేకూర్చిన ప్రభుత్వం రెండవ విడత పథకం ప్రారంభించినప్పటికీ ఇంతవరకు ఆ పథకం మార్గదర్శకాలను మాత్రం విడుదల చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ తక్షణమే స్పందించి దళితబంధు పథకం మార్గదర్శకాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రెండో విడతలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ముందుగా ప్రకటించిన రెండు వేల మంది లబ్దిదారులకు ఈ పథకం వర్తింపజేసేలా చర్యలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టిఎమ్మార్పీఎస్ జిల్లా కోశాధికారి లింగంపల్లి ప్రసన్నకుమార్, ప్రచార కార్యదర్శి తార రవికుమార్, ఉపాధ్యక్షులు కత్తి గంగాధర్, నాయకులు ముక్కెర అశోక్, గవ్వాలే రవి, చొప్పదండి భూమన్న పాల్గొన్నారు.

గుడంబా తయారు చేస్తే చర్యలు



నవతెలంగాణ-సారంగాపూర్

గుడుంబా తయారు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్ఐ రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కుప్టితండాలో సిబ్బందితో కలిసి గుడంబా స్థావరాలపై దాడులు చేసి ఐదు లీటర్ల గుడంబా, వంద లీటర్ల బెల్లం పానకం ప్లాస్టిక్ డబ్బాలను ధ్వంసం చేశారు. నిషేధిత గుడంబాను తయారు చేస్తున్న జాదవ్ అరవింద్‌ను తహసీల్దార్ సంతోష్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. ఈయన వెంట ఎక్సైజ్ సిబ్బంది ముత్యం ప్రకాష్, రవీందర్, వెంకటేష్, ఇర్ఫాన్, రాజశేఖర్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు అంతర్గత శిక్షణ

నవతెలంగాణ-నిర్మల్

పదవ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించడానికి నూతన ప్రశ్నపత్ర విధానాలపై జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ఉపాధ్యాయులకు సోఫీనగర్ పాఠశాలలో బుధవారం అంతర్గత శిక్షణను డీసీఓ సంతోష్‌కుమార్ ఇచ్చారు. ఈ శిక్షణలో భాగంగా మొదటి రోజు బుధవారం తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషా విషయాలపైన ఉపాధ్యాయులకు విద్యార్థులకు 10కి 10జీపీ వచ్చే విధంగా మెలకువలను నేర్పించారు. ఉదయం, రాత్రి స్టడీ అవర్స్ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రెండవ రోజు ఫిజికల్ సైన్స్, గణితం, మూడవ రోజు బయోలాజికల్ సైన్స్, సాంఘిక శాస్త్రం శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సారంగాపూర్ బాలికల పాఠశాల ఎస్ఓ మోహన్, దిలావర్‌పూర్ బాలుర పాఠశాల ఎస్ఓ నందకుమార్, భాష రిసోర్స్ పర్సన్స్ అమృత, అనిల్‌కుమార్, ఉషాకిరణ్ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరుణ్‌రెడ్డిని ఐటీడీఏ పీఓగా కొనసాగించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వరుణ్‌రెడ్డిని ఐటిడిఏ పిఓగా కొనసాగించాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కొట్నాక విజయ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరుణ్‌రెడ్డి ఐటిడిఏ పిఓగా అతి తక్కువ కాలం పని చేశాడని, అయినప్పటికీ ఆదివాసుల మదిలో నిలిచిపోయాడని కొనియాడారు. గతంలో ఏ పీఓ కూడా ఆదివాసి గూడాల్లో తిరిగి సమస్యలు తెలుసుకోలేదని, ఆ పని వరుణ్‌రెడ్డి చేశాడన్నారు. పిఓగా కనీసం రెండు సంవత్సరాలు పనిచేస్తే ఆదివాసుల సమస్యలు కొన్ని పరిష్కారమయ్యేవని ఏడు నెలల్లోనే బదిలీ చేయడం దారుణమని తెలిపారు. తిరిగి ఆయనను పీఓగా నియమించాలని, లేదంటే ఆదివాసులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు కోవ విజయ్ కుమార్, జిల్లా నాయకులు కుమురం భగవంత్‌రావ్, పెందోర్ వినేష్, ఆత్రం సాయినాథ్, కొలాం సంఘం నాయకుడు మడావి రాజు పాల్గొన్నారు.

ఆముదం తిని ఏడుగురు చిన్నారులకు అస్వస్థత

ఆసిఫాబాద్: వాంకిడి మండలం చిన్నపుల్ల గ్రామంలో ఆముదం తిని ఏడుగురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పిల్లలు ఆడుకుంటూ ఆముదం తినడం వల్ల వాంతులు, విరేచనాలు అయ్యాయి. వెంటనే గుర్తించి అంబులెన్స్‌కు సమాచారం అందించి అంబులెన్స్‌లో పిల్లలను వైద్యం కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అస్వస్థతకు గురైన చిన్నారుల్లో భూమిక సూర్వం, తొడ్సం జంగు, జానుబాయి, నాగబాయి, నందు, కీర్తన ఆసిఫాబాద్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

రాష్ట్ర స్థాయి స్పెల్ విజార్డ్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు జి.వర్షిత్, యం.అక్షిత జిల్లా స్థాయి స్పెల్ విజార్డ్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. మంగళవారం కాగజ్‌నగర్‌లో ఎల్టా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి గుండేటి వర్షిత్ ప్రథమ స్థానం, 9వ తరగతి విద్యార్థి యం.అక్షిత ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఆంగ్ల ఉపాధ్యాయులు రేష్మా పర్వీన్, భాగ్యశ్రీ, అరుణ, పాఠశాల సిబ్బంది అభినందించారు.

పాఠశాలల్లో నాణ్యమైన విద్యకే మన ఊరు-మన బడి

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించాలని, బడి పిల్లల భవితకు బంగారు బాటలు వేయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ మన ఊరు - మన బడి, మన బస్తీ-మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ మండలంలోని ఎల్లపల్లి గ్రామంలో మన ఊరు - మన బడి కార్యక్రమంలో మొదటి విడతలో పనులు పూర్తయిన పాఠశాలలో ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత మౌలిక వసతుల కల్పనలో దేశంలో మన రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. విద్యారంగం బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సర్కారు స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వెల్లడించారు. మన ఊరు -మన బడి పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా రూ.7,289 కోట్లతో 12 రకాల మౌలిక వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. పాఠశాల విద్యలో విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. ఇలా అన్ని సౌకర్యాలు కల్పించడంతో ఉపాధ్యాయులు సైతం ప్రశాంత వాతావరణంలో పాఠాలు బోధించే అవకాశం కలిగిందన్నారు. గ్రామాలలోని పాఠశాల్లో ఇంగ్లీష్ మీడియం విద్యాబోధన చేపట్టి, దశల వారీగా డిజిటల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తుందన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. జిల్లాలో మొదటి విడతలో రూ.82 కోట్లతో 260 స్కూళ్లను ఆధునీకరిస్తున్నామని, మూడు దశల్లో అన్ని పాఠశాలల్లో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ముషారఫ్ ఫారూఖీ అలీ, జడ్పీ చైర్మన్ విజయలక్ష్మిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-ముధోల్

ఉన్న ఊరును, కన్న వాళ్లను, కట్టుకున్న భార్యాపిల్లలను విడిచి కుటుంబ పోషణకు దుబాయ్ వెళ్లిన యువకుడు అర్ధాంతరంగా తనువు చాలించాడు. అక్కడ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని వార్త తెలిసి కుటుంబం షాక్‌కు గురైంది. ఇంటి పెద్దదిక్కు నాలుగు సంవత్సరాల క్రితం దుబాయ్ వెళ్లి ఇప్పుడు శవమయ్యాడంటే మృతుని కుటుంబం తట్టుకోలేకపోతోంది. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన ఎస్.పోతన్న(31) బతుకుదెరువు కోసం 4 సంవత్సరాలుగా దుబాయ్‌కి వెళ్లి పని చేస్తున్నాడు. అక్కడి ఎమిరెడ్ స్పెషాలిటీ మేనేజ్మెంట్ అనే ప్రైవేటు కంపెనీలో లేబర్ వర్కర్‌గా వెళ్లాడు. కుటుంబ పోషణకు చేసిన రూ2.5లక్షల అప్పు తీర్చేందుకు దుబాయ్ వెళ్లాడు. జనవరి 26న అక్కడ అద్దెకున్న ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 27న కంపెనీ నుండి స్థానిక సర్పంచ్‌కు సమాచారం అందింది. ఆత్మహత్యకు కారణాలు మాత్రం తెలియజేయలేదు. ఈ వార్త విన్న వెంటనే మృతుడి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. భార్య, 12 సంవత్సరాల మతిస్థిమితం లేని కుమారుడు, 8 సంవత్సరాల కూతురు ఉంది. చిన్న రేకుల షెడ్డులో కుటుంబం సభ్యులు నివసిస్తున్నారు. ఇంటి పెద్ద దిక్కు లేకపోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడ్డట్టయింది. పోతన్న మృతదేహం స్వగ్రామం తీసుకు రావటానికి ప్రభుత్వం సహకరించాలని గ్రామస్తులు ట్విట్టర్‌లో పోస్టు చేయగా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కెటిఆర్ స్పందించి తగు ఏర్పాట్లు చేస్తామని తెలిపినట్లు మృతుని కుటుంబ సభ్యులు బుధవారం తెలిపారు. కుటుంబ పరిస్థితి దయనీయంగా ఉండడంతో దాతలు సహకరించాలని వేడుకుటుంన్నారు. సహాయం చేసే దాతలు నిమ్మల సరిత ముధోల్ బ్రాంచ్ ఎస్‌బీఐ అకౌంట్ నెంబర్ 62483221279కు డబ్బులు పంపాలని కోరుతున్నారు.

ఉపాధి హామీకి ఉరేసిన కేంద్ర బడ్జెట్

- బడ్జెట్ పత్రాలను తగలబెట్టి నిరసన



నవతెలంగాణ-ఖానాపూర్

నిరుపేదలకు అన్నం పెట్టే ఉపాధి హామీని కేంద్రం ఉరేసిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో బడ్జెట్ పత్రాలను తగులబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో గ్రామీణ ఉపాధి హామీ ఆహార సబ్సిడీ రైతులకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీలపైన భారీ ఎత్తున కోత విధించిందన్నారు. గ్రామీణ ప్రాంత పేదల నోట్లో మట్టి కొట్టిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేయాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీకి గత బడ్జెట్లో 89 వేల కోట్లు కేటాయించిన మోడీ ప్రభుత్వం ఈ బడ్జెట్లో 60వేలకోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు. రాష్ట్రంలో 55లక్షల జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడనుందని తెలిపారు. సబ్సిడీ బియ్యం, గోధుమలు, పిండి, పామాయిల్ వంటివి అందించే బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకోచూస్తున్నట్లు కనిపిస్తున్నదన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రెండు లక్షల 25 వేల కోట్లు గత బడ్జెట్లో కేటాయించిన మోడీ ప్రభుత్వం ఈ బడ్జెట్లో 1,75 వేల కోట్లకు తగ్గించిందని, ఒక్క యూరియాపైనే 15వేల కోట్లను తగ్గించటం ఆందోళన కలిగిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కౌలు రైతులు, పోడు సాగుదారులు, భూనిర్వాసితుల గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం మోడీ ప్రభుత్వ కుటిల బుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం ఖానాపూర్ మండల కార్యదర్శి నలిమెల రాజేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు జాన్‌పాల్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆలూర్ గ్రామంలో రూ.25 లక్షలతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనం, రూ.20లక్షలతో వ్యవసాయ గోదాం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం 24గంటలు ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలు ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ రైతు సంక్షేమానికి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడం వల్ల రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు వెంకట్ రాంరెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎఎంసి చైర్మన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, అడెల్లి పోచమ్మ చైర్మన్ ఐటి చందు, రైతుబంధు జిల్లా సభ్యులు జీవన్‌రావు, వైస్ ఎంపీపీ రాధ భూమేశ్, గ్రామ సర్పంచ్ దండు రాధ సాయికృష్ణ, మాజీ ఎంపీపీ గడ్డం ముత్తన్న, మాజీ ఎఎంసి చైర్మన్ రాజ్‌మహమ్మద్, మాజీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫేర్‌లో ఉపాధ్యాయుని ప్రతిభ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గత నెల 27 నుండి 31 వరకు కేరళ రాష్ట్రం త్రిసూర్‌లో నిర్వహించిన దక్షిణ భారత స్థాయి సైన్స్ ఫేర్‌లో కాగజ్‌నగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు మామిడాల తిరుపతయ్య ప్రతిభ కనబర్చారు. ఉపాధ్యాయుల బోధనోపకరణాల విభాగంలో కాగజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పెట్రోల్‌పంపు) ఉపాధ్యాయులు మామిడాల తిరుపతయ్య గణిత విభాగంలో జ్యామితీయ ఆకృతులను సులభంగా నేర్చుకోవడంపై ప్రదర్శన నిర్వహించారు. దీనిని అభినందిస్తూ కేరళ రాష్ట్ర పాఠశాల విద్యా సంచాలకులు జీవన్‌బాబు ప్రశంసాపత్రాన్ని మామిడాల తిరుపతయ్యకు అందించారు. గత డిసెంబర్ 11 నుండి 13 వరకు నిర్మల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జవహర్‌లాల్ నెహ్రూ సైన్స్ అండ మ్యాథమెటికల్ ఎన్విరాన్‌మెంటల్ ఎగ్జిబిషన్‌లో మామిడాల తిరుపతయ్య ప్రదర్శన ఎంపికై దక్షిణ భారత స్థాయి ప్రదర్శనలో పాల్గొన్నారు.



యువతకు వాలీబాల్ కిట్లు అందజేత



నవతెలంగాణ-రెబ్బెన

మండలకేంద్రంలోని యువతకు పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఎస్సై ఎల్.భూమేష్ రెండు వాలీబాల్ కిట్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత ఎటువంటి చెడు వ్యసనాలకు బానిస కాకుండా సరైన మార్గం ఎంచుకోవాలన్నారు. యువత గంజాయి, మద్యం, సిగరేట్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలతో శారీరక శ్రమ, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న ఉద్యోగ నోటిఫికేషన్‌లను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేతన జీవులను వంచించిన కేంద్రం : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి మధ్య తరగతి వేతన జీవులను కేంద్రం వంచించిందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైద్య శాంతికుమారి, ఇందూరావులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాత, కొత్త పన్ను విధానాలను కొనసాగిస్తూ క్రమంగా పాత పన్ను విధానాన్ని ఎత్తివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నట్లు ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైందని అన్నారు. కార్పోరేట్లు, ధనికులకు అధిక పన్ను రాయితీ ఇచ్చిన ప్రభుత్వం, చిన్న, మధ్య తరగతి ఉద్యోగులకు ఏ మాత్రం ప్రయోజనం కలిగించలేదని అన్నారు. పాత పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ.2.50 లక్షల నుండి రూ.3.00 లక్షలకు పెంచడం నామమాత్రమేనని పేర్కొన్నారు. 2014లో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.5 లక్షలకు గాని, పొదుపు మొత్తాలపై రూ.3 లక్షలకు పెంచాలన్న డిమాండ్‌ను అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్ల తర్వాత కూడా అమలు చేయలేదని అన్నారు.

శరవేగంగా వెంకటేశ్వర స్వామి జాతర పనులు

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్ గ్రామంలో శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం జాతర ఈ నెల 4, 5, 6వ తేదీల్లో నిర్వహించేందుకు వేగంగా సాగుతున్నాయి. బెల్లంపల్లి సింగరేణి డీవైజీఎం సిబ్బంది ద్వారా భక్తుల స్నానాలకు వాటర్‌ట్యాంకు, స్టాండు, విద్యుత్ వెలుగుల కాంతి కోసం బల్బులు బుధవారం అందజేశారు. అనంతరం జరుగుతున్న జాతర పనులను పరిశీలించారు. అకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశం చారి సమక్షంలో పనులు నిర్వహిస్తున్నారు.

ఉచిత ఆపరేషన్లకు తరలింపు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

శ్రీకొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో ఇటీవల నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరంలో ఆపరేషన్లకు ఎంపికైన వారిని బుధవారం ఆపరేషన్లకు తరలించారు. మొత్తం 23 మంది ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక కాగా వీరికి భోజన సదుపాయంతో పాటు ప్రయాణ ఖర్చులను సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అందించారు. బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రిలో వీరికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు.

నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం లాంటిది

నవతెలంగాణ-రెబ్బెన

ప్రాణపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. బుధవారం కుమురంభీం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెబ్బెన మండలంలోని వంకులం గ్రామానికి చెందిన సోమయ్యకు సీఎం సహాయ నిధి నుంచి రూ.32 వేల చెక్కును అందజేశారు.

మినీ మేడారం జాతర ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం నందిగూడ పెద్దవాగు మున్సిపల్ పంప్‌హౌజ్ వద్ద బుధవారం మినీ మేడారం జాతరను ఘనంగా ప్రారంభించారు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద డప్పు వాయిద్యాలతో ఈ జాతరను నిర్వహించారు. ఈ జాతర మూడు రోజుల పాటు కొనసాగుతుందని ఈ సందర్భంగా జాతర కమిటీ అధ్యక్షులు తుమ్మ రమేష్, కార్యదర్శి పోలోజు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మంద రాజయ్య, కోట శంకర్, పిర్సింగుల శ్రీనివాస్, సీపీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

